క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు 82 మందికి కంటి పరీక్షలు చేయగా 40 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. యువర్స్ ఫౌండేషన్ క్యాంపు చైర్మన్ వైకె శ్రీనివాసులు, పీఆర్‌టీ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

బాట్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: దాడితోట గ్రామంలోని చిత్రావతి నది ఒడ్డున వెలసిన బాట్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి గొడుగులు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మిత్రుని కుటుంబానికి చేయూత



రామాంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మిత్రులు

చెన్నేకొత్తపల్లి: అమిదాలకుంటకు చెందిన రామాంజనేయులు గత కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్రులు దిగ్భ్రాంతి చెందారు. మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. 1993–98 వరకు కనుముక్కల ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న మిత్రలందరూ తమ వంతు సాయంగా రూ.2,06,763ను డిపాజిట్ చేసి బాండ్‌ను ఆదివారం రామాంజనేయులు కుటుంబ సభ్యులకు అందజేశారు.

కనుముక్కల ఆయుర్వేద వైద్యశాలకు అవార్డు



కనుముక్కల ఆయుర్వేద వైద్యశాల

చెన్నేకొత్తపల్లి: కనుక్కలలోని ఆయుర్వేద వైద్యశాల 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' అవార్డుకు ఎంపికైనట్లు డాక్టర్ రత్న చిరంజీవి ఆదివారం తెలిపారు. ప్రజలు రోగాల బారినపడకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాలను 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారికి పలు సూచనలు, సలహాలు అందించి అందరూ ఆరోగ్యంగా ఉండే విధంగా తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అవార్డుతో తమకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

మండపం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న జ్ఞానానందరెడ్డి దంపతులు, నాయకులు

ఎన్‌పీకుంట: మరికొమ్మదిన్నె గ్రామంలోని రాగులమ్మగుడి ప్రాంగణంలో ఆదివారం గ్రామస్తుల సమక్షంలో మండపం నిర్మాణానికి స్టేట్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి విశ్రాంత వీఆర్‌ఓ దానంరెడ్డి పెద్దిరెడ్డి జ్ఞాపకార్థకంగా తన సొంత నిధులతో మండపం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తులు, భక్తులు పూజాకార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యంగా మండపం నిర్మిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే వృద్ధాశ్రమం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, స్థానిక ఎంపీటీసీ తిమ్మారెడ్డి, తిరుమలనాయుడు, ఆదినారాయణరెడ్డి, ఓబుళరెడ్డి, వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, సుబ్బారెడ్డి, రమణ, జ్ఞానానందరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సారైనా మామిడి పండేనా?

- ముందస్తు పూత కోసం భగీరథ ప్రయత్నాలు
- పంటల బీమా ప్రీమియం భారం రైతులదే..
- కూటమి ప్రభుత్వంలో పండ్ల తోటల రైతులు విలవిల

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో మామిడి సాగు వివరాలు(ఎకరాల్లో)

మండలం	సాగు విస్తీర్ణం
ధర్మవరం	1,045
బత్తలపల్లి	305
తాడిమర్రి	458
ముదిగుబ్బ	2,525
కనగానపల్లి	948
చెన్నేకొత్తపల్లి	830
రామగిరి	395



ఏలుకుంట్ల వద్ద పూత దశకు చేరిన మామిడి తోట



మామిడి తోటలో దుక్కి చేసుకుంటున్న రైతు

ధర్మవరం రూరల్: గతేడాది ఆలస్యంగా పూత రావడంతో తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులు ఈ ఏడాది పంటపై ఆశలు పెంచుకుంటున్నారు. ఇందుకోసం ముందస్తు పూతల కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది తోటల్లో దుక్కులు దున్ని ఎరువులను వేసుకున్నారు. చీడ పీడల నివారణకు రసాయనిక మందులను పిచికారీ చేసుకున్నారు. ప్రస్తుతం చీనీ, అరటి పంటల్లో దిగుబడి ఆశా జనకంగా ఉన్నా మార్కెట్‌లో ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. మరో పక్క బొప్పాయి పంటకు ఆశిస్తున్న వైరస్ కారణంగా నష్టాలు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మామిడి రైతులు పంటపై ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో పంట కోసం రూ.లక్షల పెట్టుబడులు పెడుతున్నారు. జిల్లాలో 38,594 ఎకరాల్లో మామిడి సాగులో ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

భరోసా ఇవ్వని పంటల బీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నష్టపోయిన చీనీ, అరటి రైతులకు బీమా సౌకర్యం కల్పించి ఆదుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చీనీ, అరటి రైతులు పూర్తిగా నష్టపోయినా కూటమి ప్రభుత్వం ఆదుకునే దిశగా చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మామిడి పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. ఎకరానికి రూ.1800 ప్రీమియంను చెల్లించాలని నిబంధన విధించింది. అది కూడా బీమాను జిల్లా యూనిట్‌గా తీసుకుంటారా? లేక మండలం యూనిట్‌గా తీసుకుంటారా అనేది నేటికీ స్పష్టత లేదు. ఈనేపథ్యంలో చాలామంది బీమా ప్రీమియం చెల్లించలేకపోయారు. దీనికి తోడు ప్రీమియం మొత్తం ఎక్కువగా ఉండడం వెనకడుగుకు కారణమైంది. గత ఏడాది మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ప్రీమియం చెల్లించినా నేటికీ పరిహారం అందలేదని చెబుతున్నారు.

చెట్లలో పూత కనిపించలేదు



నేటికీ మామిడి తోటల్లో ముందస్తుగా వచ్చే పూతలు కనిపించడం లేదు. గతేడాది మామిడి తోటల్లో పిందె నిలబడక చాలా నష్టపోయాం. ఈ సారైనా పంట బాగా పండితే గత ఏడాది పంటకు చేసిన అప్పులు తీరుతాయని అనుకుంటున్నాను. నాకు 300కు పైబడి చెట్లున్నాయి. ఇప్పటికే తోటలో దుక్కులు దున్ని, ఎరువులు వేసుకున్నాం.
– నారాయణరెడ్డి, మామిడి రైతు, బుద్దారెడ్డిపల్లి

ముందస్తుగా పండితే మంచి లాభాలు



మామిడి తోటల్లో ముందస్తుగా పూతలు వస్తే మంచి లాభాలు వచ్చే అవకాశాలుంటాయి. ఆలస్యంగా పూతలు వచ్చి పంట దిగుబడి వస్తే మార్కెట్‌లో ఆశించిన మేర ఆదాయం లేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.
– రమేష్, మామిడి రైతు, ఏలుకుంట్ల

సైనికుల్లా పని చేయాలి



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శంకరయ్య

రాప్తాడురూరల్: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ఎండకడుతూ మరోవైపు పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పని చేయాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం శేషంపల్లికి చెందిన ఎం.శంకరయ్యను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా శంకరయ్య ఆదివారం అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని భారీ పూల మాలతో సత్కరించారు. పార్టీ రాష్ట్ర కమిటీలో తనకు అవకాశం ఇవ్వడం పట్ల శంకరయ్య కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి



గరిశలపల్లిలో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

బత్తలపల్లి: ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశమవుతాయని, దాని దూరంగా ఉండాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి గరిశలపల్లిలో బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ గొడవలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఫ్యాక్షన్‌తో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయన్నారు. సైబర్ నేరాలపైన, ఎస్సీ, ఎస్టీ చట్టాలపైన, మహిళలపై జరుగుతున్న అఘాత్యాలపైన, ఫోక్సో కేసులపైన అవగాహన కల్పించారు.

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాత్రి గొట్లూరు గ్రామంలో గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గొడవలకు దూరంగా వుండి ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన సీతారామచంద్రస్వామి విగ్రహాలు



పూజల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్



కార్యక్రమానికి వెళ్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

బత్తలపల్లి: గంటాపురం గ్రామంలో ఆదివారం సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టను వైభవోపేతంగా జరిగింది. ఇందులో భాగంగా అర్చకులు పార్థసారధిశర్మ, దేవాలయ ప్రధాన అర్చకులు గోపాలు ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, కక్షాగ్ని జ్వాల మహాపూర్ణాహుతి, సీతారామ కల్యాణం జరిపించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వేర్వేరుగా పూజలకు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాలు భక్తి, సేవ, సాంస్కృతిక ఏకత్వానికి ప్రతీకలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో భక్తి భావనను పెంపొందిస్తాయన్నారు. ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నదానం చేపట్టారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రి సత్యకుమార్ దంపెట్ల గ్రామంలో నిర్వహించబడిన శ్రీ సీతారాముల దేవస్థానం భూమి పూజకు హాజరయ్యారు.

రౌడీషీటర్లలో మార్పు రాకపోతే చర్యలు



మడకశిరలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

పుట్టపర్తి టౌన్: నేరస్తులు, రౌడీ షీటర్లలో మార్పు రాకపోతే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని పలు పోలీస్టేషన్లలో పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్ బాలికలు, మహిళలపై లైగింక వేధింపులు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, హత్యలు, చోరీలు తదితర నేరాలకు పాల్పడితే పార్టీలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రధానంగా కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే అమ్మాయిలు వెంటపడి వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తులతోపాటు 120 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఘనంగా శతాబ్ది ఉత్సవాలు



ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్, విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్, ప్రాంత విభాగ్ ప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, బీజేపీ నాయకులు ప్రభాకర్, అంజిన్‌రెడ్డి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు



ప్రత్యేక అలంకరణలో కొత్తపేట దర్గా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటలో అస్తాణ ఎ హజరత్ మహబూబ్ సుబహాని రహం 47వ ఉరుసు మహోత్సవం ఆదివారం ముగిసింది. రాత్రి జియారత్ కార్యక్రమం నిర్వహించారు. ఉరుసుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరైనట్లు కమిటీ అధ్యక్షుడు నాసిర్ అహమ్మద్ తెలిపారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు.

వాల్మీకి జయంతిని బహిష్కరిస్తాం

రామగిరి: రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజుల్లో నిర్వహించే వాల్మీకి జయంతి వేడుకలను తాము బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర బోయ సంఘం యూత్ అధ్యక్షుడు శ్రీనివాసులు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే వాల్మీకులను గిరిజన తెగలోకి చేరుస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఏడాదిన్నర కావస్తున్నా నెరవేర్చలేదని మండిపడ్డారు. వాల్మీకి జాతి పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా తాము మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు బహిష్కరిస్తున్నట్లు పునరుద్ఘాటించారు.

వాసవీ వన విహారిణి మహోత్సవం



ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఆదివారం ఆర్య వైశ్య సంఘం, అనుబంధ సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో వాసవీమాత వన విహారిణి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కన్యకాపరమేశ్వరిదేవిని ప్రతిరోజు ఒక్కో అలంకరణ చేశారు. దసరా ముగింపు సందర్భంగా వన విహారిణి కార్యక్రమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ. కర్ణాటక తరహాలో కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

కదిరి టౌన్: తెలంగాణ, కర్ణాటక తరహాలో కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణన త్వరలో పూర్తి చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీల్లో కొన్ని కులాలకు మాత్రమే రాజకీయంగా అవకాశం దక్కుతోందన్నారు. కులగణనతో ఆయా కులాల వారికి ఏం చేయాలి, ఏ విధంగా వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు మధునాయక్, రైతు సంఘం నాయకులు రమణ, ఆదెప్ప పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం బీడుపల్లి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం బీడుపల్లికి చెందిన శంకరనారాయణరెడ్డి, కుమార్తె సాయి ధరణి, శ్రీధర్‌రెడ్డి జరిగింది. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రెస్కో మాజీ చైర్మన్ దుద్దుకుంట వెంకటరామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ రవినాయక్, మాధవరెడ్డి, రుషీకేశవరెడ్డి, రంగారెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, తలమర్ల సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న దుద్దుకుంట వెంకటరామిరెడ్డి

బాలుడికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన దిలీప్ అనే బాలుడు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శత జయంతి వేడుకలకు శరవేగంగా ఏర్పాట్లు



ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణం



ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ సమీపంలో పార్కింగ్‌కు సిద్ధమైన స్థలాలు



తాగునీటి కోసం సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంక్‌లు

పుట్టపర్తి అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా భక్తులు వచ్చే సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేపట్టడంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిమగ్నమైంది. ఏడాది కాలంగా ఒక ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లను చేస్తోంది. ఇప్పటికే సత్యసాయి సంస్థలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రశాంతి నిలయం వంటి వాటికి రంగులు వేసే కార్యక్రమం పూర్తి చేసింది. లక్షలాది మంది తరలిరానున్న దృష్ట్యా వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాలు సిద్ధం చేస్తుండగా , పార్కింగ్ స్థలాలు చదును చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఒక్కో వాటర్ ట్యాంక్ 10 వేల లీటర్ల కెపాసిటీ కలిగినవి సిద్ధం చేస్తోంది. మరుగుదొడ్లకు కుళాయిలు, మురుగు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇక ప్రశాంతి నిలయంలోనూ, వెస్ట్ గేట్ సమీపంలో వీవీఐపీలకు విడిది చేయడానికి అధునాతనమైన వసతి కేంద్రాలను నిర్మిస్తోంది.

పురోగతి లేని ప్రభుత్వ పనులు..

అయితే కూటమి ప్రభుత్వం ఇంత వరకూ ఒక తట్టె మట్టి కూడా వేయలేదు. ఇటీవల పనులు ప్రారంభించినా ఇప్పటి వరకూ ముందుకు సాగడంలేదు. ఇప్పటికే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పుట్టపర్తితో పాటు సమీప కేంద్రాల్లో ఉన్న లాడ్జీలు, వసతి కేంద్రాలు, హోటళ్లను బుక్ చేసుకుంటున్నారు. నవంబర్ 15 నుంచి 24 వరకూ జరిగే వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 9న తలపెట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని షిర్డీ సాయిబాబా సేవా సమితి అధ్యక్షులు వీరనారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య, ఉప కార్యదర్శి నాయుడు, కోశాధికారి సూర్యనారాయణ, డైరెక్టర్ సూర్యప్రకాష్ ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కదిరి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో జీవిమాను సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, చౌక్ బజార్, హిందుపురం క్రాస్, వేమారెడ్డి సర్కిల్‌లో ట్రాఫిక్‌ని క్లియర్ చేయడంతోపాటు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐతో పాటు ఎస్‌ఐ బాబ్జాన్, ట్రైనీ ఎస్‌ఐ సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

ధర్మవరం రూరల్: పోతులనాగేపల్లి కాలనీలో రత్నాకర్ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి(ఈ నెల 7న) సందర్భంగా కాలనీలో వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు ఆ సంఘం నాయకులు స్థలాన్ని పరిశీలించారు. అందులో భాగంగా స్థల దాత మల్లికార్జున ఆధ్వర్యంలో ఆదివారం జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు నక్కల వెంకటేష్, ధనుంజయ, విజయ్‌కుమార్, పోతులయ్య, శ్రీనివాసులు, ముత్యాలు, పాన్ నరసింహులు, శ్రీరాములు, రాము, కేశవయ్య, లక్ష్మన్న, పుల్లయ్య, లింగమయ్య పాల్గొన్నారు.